
గూడూరు మండలం గాజులగుట్టలో క్యూలైన్‌లో ఉన్న రైతులు


పెద్దతండాలో యూరియా బస్తాల కోసం క్యూలైన్‌లో నిల్చున్న మాజీమంత్రి సత్యవతిరాథోడ్

అందరికీ యూరియా అందిస్తాం

రైతులకు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ భరోసా

నెల రోజులు దాటినా.. యూరియా కష్టాలు తీరడం లేదు. రాత్రివేల వెళ్లి పడుకున్నా.. ఉదయం వెళ్లి క్యూలో నిల్చున్నా రైతులకు బస్తా దొరుకుతది అన్న గ్యారంటీ లేదు. గత కొన్ని రోజులుగా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ యూరియా పంపిణీ చేసే కేంద్రాలను తనిఖీ చేస్తున్నారు. అధికారులుకు, సంబంధిత సిబ్బందికి సూచనలు ఇస్తున్నా.. పోలీసుల పర్యవేక్షణలో సరఫరా చేస్తున్నా అక్కడక్కడ యూరియా కోసం రైతులు ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. బస్తాల కోసం ద్విచక్రవాహనాలపై వెళ్తూ ఇప్పటికే కొందరు గాయపడ్డారు. పలువురు మృత్యువాత పడ్డారు. ఆదివారం కంబాలపల్లి యూరియా కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. తొర్రూరులో డీఎస్పీ కృష్ణ కిషోర్ తనిఖీ చేశారు. పెద్దతండాలోని రైతు వేదికలో సత్యవతిరాథోడ్ క్యూలైన్‌లో నిలబడ్డారు.


కంబాలపల్లిలో యూరియా పంపిణీ కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

- కర్షకులకు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటాం
- తొర్రూరు రైతు వేదికలో డీఎస్పీ తనిఖీ
- పెద్దతండాలో యూరియా కోసం క్యూలో ఉన్న సత్యవతిరాథోడ్
- కోబల్‌తండాలో అన్నదాతల రాస్తారోకో

మహబూబాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ రైతుకు యూరియా అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ తెలిపారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లిలో యూరియా పంపిణీ కేంద్రాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరికీ పారదర్శకంగా యూరియా అందేలా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు వివరాలు సేకరించి ఆన్‌లైన్ మిషన్, రిజిస్టర్‌లో నమోదు చేసి అమ్మకాలు కొనసాగించాలని చెప్పారు. యూరియా పంపిణీ కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బంది కలుగకుండా సౌకర్యాలు కల్పించామని తెలిపారు. నిత్యం యూరియా పంపిణీపై అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో విధుల్లో ఉన్నారని తెలిపారు. అనంతరం కేసముద్రం మండలం అమీనాపురంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. డైనింగ్ హాల్, స్టోర్ రూమ్, కిచెన్‌షెడ్, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. పిల్లలకు షెడ్యూల్ ప్రకారం అల్పాహారం, భోజనాన్ని అందించడంతో పాటు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయ అధికారిని విజయనిర్మల, డీఆర్‌డీఏ ప్రాజెక్టు మధుసూదన్‌రాజు, తహసీల్దార్లు రాజేశ్వర్‌రావు, వివేక్ పాల్గొన్నారు.

పంపిణీపై సమన్వయ సమావేశం

● కేసముద్రం : కేసముద్రం ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీవో మధుసూదన్‌రాజు ఆధ్వర్యంలో యూరియా పంపిణీపై వివిధ శాఖలతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ రైతుభరోసా పోర్టల్ నుంచి తీసుకున్న జాబితా ఆధారంగా గ్రామాల వారీగా వరుస క్రమంలో యూరియా పంపిణీని చేపట్టామని తెలిపారు. గత పది రోజుల్లో 8,133 యూరియా బస్తాలను పంపిణీ చేశామని తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 49,250 బస్తాలను అందించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వివేక్, ఎంపీడీవో క్రాంతి, ఎస్‌ఐ మురళీధర్‌రాజ్, ఏవో బి.వెంకన్న పాల్గొన్నారు. ధన్నసరి సొసైటీ వద్ద యూరియా పంపిణీని డీఎస్పీ తిరుపతిరావు పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్‌ఐలు మురళీధర్‌రాజ్, కరుణాకర్, సొసైటీ చైర్మన్ మర్రి రంగారావు, సీఈవో గోపాల మల్లారెడ్డి ఉన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు : డీఎస్పీ

తొర్రూరు : యూరియా సరఫరాపై

(మిగతా 8లో..)

బస్తాల కోసం క్యూలో నిల్చున్న సత్యవతి

●కురవి : మాజీమంత్రి సత్యవతిరాథోడ్ యూరియా బస్తాల కోసం మహిళా రైతులతో కలిసి క్యూలైన్‌లో నిల్చున్నారు. పెద్దతండాలో సత్యవతిరాథోడ్‌కు ఐదున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. యూరియా కోసం ఆదివారం పెద్దతండాలోని రైతు వేదికలో మహిళా రైతులతో కలిసి క్యూలైన్‌లో నిలబడ్డారు. దాదాపు గంటన్నర సేపు క్యూలైన్‌లో నిల్చున్నప్పటికి కూపన్ ఇచ్చారు. కానీ, యూరియాకు గ్యారెంటీ ఇవ్వలేదన్నారు. కేవలం ఒక బస్తాకు మాత్రమే కూపన్ ఇవ్వడం రాష్ట్రంలో రైతుల పరిస్థితికి అద్దం పడుతుందన్నారు. రైతులు నెల రోజులుగా వ్యవసాయ పనులు వదిలేసి యూరియా కోసం వారాలు, రోజుల తరబడి క్యూలైన్‌లలో వేచి ఉండడం దిక్కుమాలిన కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని సత్యవతిరాథోడ్ పేర్కొన్నారు.

ఏజెన్సీలో ‘యూరియా’ రాజకీయం

- రైతులకు ఏం జరిగినా దాని కోసమేనంటూ హంగామా
- ఆ తర్వాత మాట మార్చుతున్న బాధితులు
- సోషల్ మీడియాలో అధికార, ప్రతిపక్ష నాయకుల వార్

8


జగన్నాయకులగూడెం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం


బానోత్ లాల్య(ఫైల్)


ధరావత్ వీరన్న(ఫైల్)

ఉసురు తీసిన ‘యూరియా’

- కూపన్ల కోసం బైక్‌పై వెళుతుండగా ప్రమాదం
- బొలెరో ఢీకొని ఇద్దరు రైతుల మృతి
- జగన్నాయకులగూడెం రహదారిపై ఘటన

గూడూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): యూరియా కూపన్ల కోసం వెళుతున్న ఇద్దరు రైతులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడ్డారు. గూడూరు మండలం జగన్నాయకుల గూడెంలో వద్ద ఆదివారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి గూడూరు ఎస్సై గిరిధర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బగూడెంకు చెందిన బానోతు లాల్య (77)కు రెండెకరాల వ్యవసాయ భూమి (మిగతా 8లో..)


వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షిస్తున్న నిర్వహిస్తున్న భూక్య మురళీనాయక్

ప్రతీ రైతుకు బస్తాలు అందుతాయి

- దళారుల వల్ల యూరియా కృతిమ కొరత
- అన్నదాతలను ఇబ్బంది పెట్టే విధంగా వ్యవహరిస్తే చర్యలు
- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమ లక్ష్యంగా పని చేస్తున్న ప్రజా ప్రభుత్వంలో ప్రతీ రైతుకు యూరియా అందుతుందని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానుకోట నియోజకవర్గంలో సాగు చేస్తున్న వ్యవసాయ భూముల ఆధారంగా ప్రతీ ఒక్క రైతుకు యూరియా బస్తాలు అందించే బాధ్యత మనపై ఉందని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమ చూపుతుందని విమర్శించారు. కొంతమంది వ్యక్తులు అవసరం లేకున్నా క్యూలైన్‌లో నిల్చుని యూరియా బస్తాలు తీసుకుని వాటిని బ్లాక్‌లో విక్రయిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. రైతులను ఇబ్బంది పెట్టే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గిరిజన తండాలు, గూడాల్లో ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలు కలిగిన రైతులకు యూరియా ఇవ్వడంతో పాటు గత కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న గిరిజన రైతులందరికి యూరియా అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏవో తిరుపతిరెడ్డి, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

నేడు గ్రీవెన్స్ సెల్ రద్దు

● కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌సెల్‌ను రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి అధికారులంతా అన్ని మండలకేంద్రాల్లో రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమంలో నిమగ్నమై ఉండడంతో గ్రీవెన్స్‌సెల్‌ను నిర్వహించడంలేదని చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

జిల్లాలో మోస్తరు వాన

8

దేశ సంపదను సృష్టించేది కార్మికులే

- శ్రమదోపిడీ కోసమే నాలుగు లేబర్ కోడ్‌లు
- ఇప్పటికు నాలుగున్నర దశాబ్దాల కార్మికోద్యమ చరిత్ర
- సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ప్రదీప్
- ముగిసిన రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు

కేసముద్రం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దేశ సంపదను సృష్టించేది కార్మికులేనని, కేంద్రం అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలతో అలాంటి కార్మికుల సంక్షేమ ప్రమాదంలో పడిందని ఇఫ్టూ జాతీయ ఉపాధ్యక్షుడు బి.ప్రదీప్ అన్నారు. కేసముద్రం హరిహర గార్డెన్స్‌లో రెండురోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు 29 జిల్లాల ప్రతినిధులు హాజరుకాగా ఆదివారం ముగిశాయి. చివరి రోజున బి.ప్రదీప్ మాట్లాడుతూ ఇఫ్టూకు నాలుగున్నర దశాబ్దాల కార్మికోద్యమ చరిత్ర ఉందని, సంఘం ఆధ్వర్యంలో అనేక సమరశీల పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో స్వతంత్ర పోరాటాలను చేపట్టి కార్మికులకు విజయాలను సాధించి పెట్టిందని అన్నారు. ఐక్య కార్యాచరణ ఉద్యమాల్లోను చురుకైన పాత్రను పోషించి పలు అనుబంధ సంఘాలను ఏర్పాటు చేసుకుందని తెలిపారు. ఈ క్రమంలో అనేక మంది బలిదానాలు చేస్తూ సంస్థను బలమైన కార్మిక సంఘంగా ముందు వరుసలో నిలిపారని అన్నారు. కార్పొరేట్ రంగాలకు మద్దతుగా కార్మికుల శ్రమదోపిడీ కోసమే కేంద్రం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని ఆరోపించారు. లేబర్ కోడ్‌ల రద్దు కోసం దేశవ్యాప్త ఉద్యమాన్ని తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, సూర్య శివాజీ, మండల వెంకన్న, హలావత్ లింగ్యా, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పర్వత కోటేష్, శివారపు శ్రీధర్, బొమ్మగాని వెంకన్న, పిన్నోజు చంద్రమౌళి, బండి రాజు పాల్గొన్నారు.


కేసముద్రంలో రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ప్రదీప్






విద్యార్థులకు వ్యాల్యూ ఎడ్యుకేషన్

నేటి నుంచి టీ షాట్ విద్యా చానల్‌లో ప్రసారం

ప్రారంభించనున్న పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి యోగితారాణా

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించి క్రమశిక్షణతో కూడిన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర సర్కార్ దృష్టి సారించి విలువ విద్య (వ్యాల్యూ ఎడ్యుకేషన్)కు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే నైతిక విలువలు, మానవత్వం, వ్యక్తిత్వం, సృజనాత్మకత, బాధ్యతలను పెంపొందించేందుకు రాష్ట్ర విద్యాశాఖ సన్నద్ధమైంది. ఈ నెల 15న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు టీ-షాట్ విద్యాచానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం (ఫోన్ ఇన్ లైవ్) చేసేందుకు చర్యలు చేపట్టింది. హైదరాబా ద్ నుంచి పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణా ప్రారంభించి ఈ కార్యక్రమం ప్రా ముఖ్యతను వివరించనున్నారు. ఈనెల 15న ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి మధ్యా హ్నం 3.30 గంటల వరకు ఈ కార్యక్రమం ప్రసారం చేయనున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ టీ షాట్ చానల్ ఆ సమయాల్లో ప్రసారం చేయనున్నారు.



కార్యక్రమ ముఖ్యఉద్దేశం..

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు వ్యక్తిగత, సామాజిక బాధ్యతను తెలియజేయడం, నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు, బాధ్యతాయుతంగా నిర్ణయాలు తీసుకునేలా విద్యార్థులను సిద్ధం చేయనున్నారు. ప్రస్తుతం విలువలను కేవలం పాఠ్యాంశాలకు మాత్రమే పరిమితం చేయకుండా చదువుతున్న అన్ని సబ్జెక్టులతో సమన్వయం చేస్తూ సామర్థ్యాలను మెరుగుపరచడంపై దృష్టి సారించనున్నారు. విజ్ఞానశాస్త్రం వంటి సబ్జెక్టులను బోధించే సమయంలో కూడా విలువలతో కూడిన విద్య ప్రాముఖ్యతను అనుసంధానం చేయాలని విద్యాశాఖ నిర్ణయించి ఆ దిశగా కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది.

935 పాఠశాలలు, 40,292 మంది విద్యార్థులు

మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల పరిధిలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు-901, మోడల్ స్కూల్స్-8, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు-16 మొ త్తం 935 పాఠశాలలుండగా వాటిల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఇం గ్లీష్, ఉర్దూమీడియంలలో 40,292 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఈ కార్యక్రమం విద్య, నిపుణ చానళ్లలో ప్రసారం కానుంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షించి విలువల విద్యపై అవగాహన పెంపొందించుకునేందుకు విద్యాశాఖ అమలులోకి తీసుకువచ్చింది.



పాఠశాల స్థాయి విద్యార్థులకు..

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల 1వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు విలువలతో కూడిన విద్య, జీవన నైపుణ్యాలను పెం పొందించేందుకు రాష్ట్ర విద్యాశాఖ పాఠ్యప్రణాళికలను రూపొందించింది. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు వివిధ రకాల ప్రధాన విలువలపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ప్రతీ తరగతిలో వీటికి సంబంధించిన పాఠాలను చేర్చారు. ఉపాధ్యాయుల బోధన కోసం ప్రత్యేకంగా కరదీపికలను తయారు చేశారు.

నైతిక విలువలు పెంపొందేందుకు దోహదం

దక్షిణమూర్తి, జిల్లా విద్యాశాఖాధికారి



పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతో పాటు విలువల విద్య కార్యక్రమం నైతిక విలువలు పెంపొందేందుకు దోహదపడుతుంది. పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు చదువుతో పాటు సమాజాభివృద్ధి, మానవత్వం మొదలగు అంశాలపై అవగాహన పెంపొందుతుంది. తద్వారా సమాజంలో ఒకరి పట్ల మరొకరికి గౌరవం ఏర్పడుతుంది.



30న పద్మశాలి ప్రతిభా పురస్కార్

తొర్రూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభ కలిగిన పద్మశాలి విద్యార్థులకు జిల్లా స్థాయిలో ప్రతిభా పురస్కార్ అవార్డులు అందజేయనున్నట్లు పోపా జిల్లా అధ్యక్షుడు బుదారపు శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, ఐటీ, మెడికల్‌లలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పద్మశాలి కులబాంధవులకు ఈ నెల 30వ తేదీ తొర్రూరులోని వందేమాతరం ఫౌండేషన్‌లో అవార్డులు అందజేస్తుందని, అర్హులైన వారు 9441055082, 9440672321 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

కురవి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన దూదికట్ల రఘు కుటుంబాన్ని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ ఆదివారం పరామర్శించారు. రఘు చిత్రపటానికి పూలమాల వేసి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బోడ శ్రీను, బాదె నాగయ్య, దూదికట్ల శ్రీనివాసచారి, వీరభద్రచారి, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు బలపాలలో ఎస్‌జీఎఫ్ సెలక్షన్స్

కురవి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బలపాల జడ్పీఎస్‌ఎస్ పాఠశాలలో సోమవారం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో సెలక్షన్స్ నిర్వహిస్తున్నామని కురవి, సీరోలు ఎంఈవోలు బాలాజీనాయక్, లచ్చిరాంనాయక్ ఆదివారం తెలిపారు. ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, అండర్-14, 17 బాలబాలికలకు సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇక్కడ సెలక్షన్ అయిన విద్యార్థులు జోనల్‌స్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు ఆధార్‌కార్డు జిరాక్స్, పాఠశాల నుంచి స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు.

' కొమ్మాలు మృతి విప్లవోద్యమానికి తీరని లోటు '

కొత్తగూడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపంథా పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేస్తూ, ప్రజల హక్కుల కోసం నిబద్ధతతో పోరాడిన ముద్రబోయిన కొమ్మాలు మృతి విప్లవోద్యమానికి తీరనిలోటని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాయం చిన్నచంద్రన్న, ఎన్డీ నాయకులు పుల్లన్న పేర్కొన్నారు. తిమ్మాపురంలో ఆదివారం ముద్రబోయిన కొమ్మాలు వర్ధంతి సంతాప సభ నిర్వహించారు. కొమ్మాలు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు, మౌనం పాటించారు. కార్యక్రమంలో మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి, ఏఐయూకేఎస్ జిల్లా కార్యదర్శి అవుల కట్టయ్య, పీవైఎల్ మండల అధ్యక్షుడు రాజబోయిన రాజు, నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతి


యువకుడి మృతదేహం

డోర్నకల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ రైల్వేస్టేషన్ సమీపంలో రూట్ రిలే ఇంటర్‌లాకింగ్ క్యాబిన్ వద్ద గుర్తు తెలియని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. డోర్నకల్ సీఐ చంద్రమౌళి తెలిపిన వివరాల ప్రకారం. డోర్నకల్ రైల్వేస్టేషన్ సమీపంలో రూట్ రిలే ఇంటర్‌లాకింగ్ క్యాబిన్ వద్ద ఓ యువకుడు అపస్మారకస్థితిలో పడి ఉండడం గమనించిన పోలీసులు అతడిని 108 వాహనంలో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతన్ని పరిక్షించిన వైద్యులు అప్పటికే ఆ యువకుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు బ్లూకలర్ జీన్స్‌ప్యాంటు, గళ్ల చొక్క ధరించి ఉన్నట్లు చెప్పారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

తొర్రూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆదివారం ఎంఈవో కార్యాలయం ముందు సమగ్ర శిక్షణ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి వారు మాట్లాడారు. ఎన్నికల ముందు గత సంవత్సరం వరంగల్‌లో జరిగిన సమగ్ర శిక్షణ ఉద్యోగుల దీక్ష శిబిరానికి పీసీసీ అధ్యక్షుడి హోదాలో హాజరై అధికారంలోకి వచ్చిన వెంటనే రెగ్యుల్ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, రెండు సంవత్సరాలు పూర్తయినా సమగ్ర శిక్షణ ఉద్యోగులను పట్టించుకోకపోవడం సరికాదన్నారు.

విద్యాశాఖలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సమగ్ర శిక్షణ ఉద్యోగుల సేవలు గుర్తించి వెంటనే రెగ్యులర్ చేయాలని, ఇతర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వెల్తూరి మల్లేశం, సీఆర్పీలు కల్పన, వీణ, రాధిక, భాస్కర్, రమేశ్, రవి తదితరులు ఉన్నారు.

అన్నదాతలకు భరోసాగా జిల్లా పోలీస్ బాస్

● ప్రతీ రైతుకు యూరియా అందేలా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ ప్రత్యేక దృష్టి ● హర్షం వ్యక్తం చేస్తున్న కర్షకులు, ప్రజలు


నర్సింహులపేట మండలకేంద్రంలో రైతు సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు యూరియా కొరతతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న అన్నదాతలకు ఆసరాగా నిలుస్తూ, భళా అనిపించుకుటున్నారు జిల్లా పోలీస్ బాస్ సుధీర్‌రాంనాథ్ కేకన్. గత ఆగస్టు మాసం నుంచి యూరియా కొరతతో జిల్లా వ్యాప్తంగా రైతన్నలు నిరసనలు, ఆందోళనలు చేస్తూ రోడెక్కిన తరుణంలో ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ స్వయంగా రంగంలోకి దిగారు. పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేయడంతో పాటు వ్యవసాయ అధికారులను సమన్వయ పరుస్తూ యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా తగు చర్యలతో ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో సుడిగాలి పర్యటన చేస్తూ యూరియా పంపిణీ కేంద్రాలను సందర్శిస్తూ రైతులకు ఎలాంటి సమస్య తలెత్తకుండా సిబ్బందితో బందోబస్త్ నిర్వహించారు. పోలీసు సిబ్బంది సహకారంతో, వ్యవసాయ అధికారులతో కలిసి ప్రతి రైతుకు సకాలంలో యూరియా అందేలా చర్యలు తీసుకుంటుండడంతో పోలీస్ బాస్ సేవలను అభినందిస్తూ అన్నదాతలతో పాటు అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనిలో బాగంగా ఆదివారం బయ్యారం, గార్ల, సీరోలు మండలం కాంపల్లి, డోర్నకల్ మండలం చిలుకోడు, కురవి మండలాలతో పాటు జిల్లా కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రాన్ని సందర్శించి యూరియా పంపిణీని పరిశీలించారు. భూమి పట్టాదారు పాసు పుస్తకాల ప్రకారం టోకెన్లు పంపిణీ చేస్తూ, యూరియా పంపిణీని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. రెండు చక్రాలపై యూరియా తీసుకెళ్లే రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు.


మన్నెగూడెం పీఏసీఎస్ వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్

ఒక్కో కుటుంబానికి రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

● మాజీ మంత్రి సత్యవతిరాథోడ్
● మానుకోటలోని పోస్టుమార్టం గది ఎదుట ఆందోళన

మహబూబాబాద్ క్రైం : యూరియా కోసం వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకొని ఒక్కో కుటుంబానికి రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని మాజీమంత్రి సత్యవతి రాథోడ్ ఆదివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ఎదుట పోస్టుమార్టం గది ఆవరణలో మృతదేహాలను సందర్శించారు. బాధిత కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి పోస్టుమార్టం గది ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలో యూరియా సరఫరాలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గూడూరు మండలంలో యూరియా బస్తాల సరఫరాకు ప్రభుత్వ విధిస్తున్న ఆంక్షలతో దుబ్బగూడెంకు చెందిన రైతులు బానోతు లాల్య, ధరావత్ వీరన్న టోకెన్ల కోసం వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదం జరిగి ఇద్దరు మృతి చెందడం దారుణమన్నారు. బాధిత రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న డీఎస్పీ తిరుపతిరావు అక్కడకు చేరుకొని ఎస్పీ ఆదేశాలమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావుతో ఫోన్‌లో మాట్లాడి బాధిత రైతు కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


మానుకోటలోని పోస్టుమార్టం గది ఎదుట ఆందోళన చేస్తున్న మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు

లాల్య, వీరన్న కుటుంబాలకు రూ.25 లక్షలు ఇవ్వాలి

గూడూరు : గూడూరు మండలం జగన్నాయకులగూడెం క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గిరిజన రైతులు బానోత్ లాల్య, ధరావత్ వీరన్నల కుటుంబాలకు రూ.25 లక్షలు అందించాలని బీఆర్‌ఎస్ నాయకులు సంపత్‌రావు, నూకల సురేందర్, ఆరె వీరన్న, వాంకుడోత్ కటార్ సింగ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గూడూరులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. జిల్లాలో రైతులు యూరియా కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. యూరియా తీసుకువచ్చేందుకు వెళ్తున్న ఇరువురు గిరిజన రైతులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధకరమన్నారు. వారి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహిస్తూ వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందించి వారిని ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో మండల మాజీ కోఆప్షన్ సభ్యులు రహీం, రమేష్, హరీష్, ఎల్లయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే..


సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్

తొర్రూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అసమర్థత వల్లే యూరియా కొరత ఏర్పడుతుందని తొర్రూరు అర్బన్ బీజేపీ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్రం యూరియా పంపడంలేదని కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని, కేంద్రం రాష్ట్రానికి కోటా మేరకు యూరియా పంపిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు దానిని వేరే చోట్ల అమ్ముకోవడంతో యూరియా కొరత ఏర్పడుతుందన్నారు. నియోజకవర్గంలో ఆగ్రోస్ కేంద్రాల నిర్వహణ అధ్వాహ్నంగా ఉందని, నిర్వాహకులు ఇష్టారాజ్యంగా గడ్డి మందులు, ఇతర అనుమతిలేని పురుగు మందులు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని, రైతు వేదికల వద్ద వ్యవసాయాధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. నవీన్, శంకర్, రవిబాబు ఉన్నారు.

మొక్కల పెంపకంతో మానవ మనుగడ

● సింగరేణి సీఎండీ బలరాంనాయక్

కృష్ణకాలనీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతో మానవ మనుగడ సాధ్యమని, భవిష్యత్ తరాలకు మనమిచ్చే గొప్ప సంపద ఇదేనని సింగరేణి సీఎండీ ఎన్.బలరాంనాయక్ అన్నారు. భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధి 5 ఇన్‌క్లైన్‌లోని సింగరేణి నర్సరీలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి 370 మొక్కలు నాటి నీరు పోశారు. అలాగే 5 ఇన్‌క్లైన్ ప్యానెల్ సమీపంలో గతంలో నాటిన మొక్కలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి పచ్చదనంతో వెల్లివిరియాలనే దృక్పథంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఇప్పటి వరకు 20,377 మొక్కలను తానే స్వయంగా నాటినట్లు వివరించారు. ఈ ఏడాది సింగరేణి వ్యాప్తంగా 40 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 25 లక్షల మొక్కలు నాటామని అన్నారు. త్వరలోనే మిగిలిన మొక్కలు సైతం నాటుతామన్నారు. సింగరేణి ప్రభావిత పరిసరాల్లోని చెరువుల పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎల్.వి.సూర్యనారాయణ, ఎన్విరాన్‌మెంటల్ జీఎం సైదులు, సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


మొక్క నాటి నీరు పోస్తున్న సీఎండీ బలరాంనాయక్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కోటంచ ఆలయ అభివృద్ధికి సీఎస్‌ఆర్ నిధులు

రేగొండ : కొటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి సీఎస్‌ఆర్ నిధులు కేటాయిస్తామని సింగరేణి సీఎండీ బలరాం తెలిపారు. మండలంలోని కోటంచ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి సందర్శించారు. బాలాలయంలో ఉన్న స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, సీఎండీ ఆలయ పునరుద్ధరణ పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ ఆలయ పునరుద్ధరణ పనులు పూర్తి కాగానే ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మహేష్, ప్రధానార్చకుడు బుచ్చమాచార్యులు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఎస్ఎస్ఆర్ సంపత్‌రావు, ఆలయ చైర్మన్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిక


ములుగులో పార్టీ కండువా కప్పుతున్న మంత్రి సీతక్క

కొత్తగూడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండంపల్లికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్క సమక్షంలో ములుగులో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మంత్రి సీతక్క పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో కడారి రామచంద్రు, మంద కొమురయ్య, బండి వెంకన్న, ఆకుల రవి, గాండ్ల శేఖర్, మెంతుల సూరయ్య ఉన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రూరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, డీసీసీ సభ్యుడు వీరనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ బానోత్ విజయ, మాజీ జడ్పీటీసీ పుల్సం పుష్పలత శ్రీనివాస్, నాయకులు సోమయ్య, దానం నారాయణ, తోట మాదవులు, లక్కాకుల వెంకటేశ్వర్లు, తీగల మహేందర్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 1,466 కేసుల పరిష్కారం

కృష్ణకాలనీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈ నెల 13న నిర్వహించినజాతీయ లోక్‌అదాలత్‌లో 1,466 కేసులు పరిష్కారం అయ్యాయని ఎస్పీ కిరణ్ ఖరే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐపీసీ బీఎన్‌ఎస్ కేసులు-355, సైబర్ క్రైమ్- 15, డీడీ, ఎంవీయాక్టు-1096కేసులు పరిష్కారమయ్యాయని వివ రించారు. 15 సైబర్ క్రైమ్ కేసుల్లో రూ.88వేల నగదును బాధితుల ఖాతాల్లో జమ చేయడానికి సం బంధిత బ్యాంక్ నోడల్ అధికారులకు ఆర్డర్ కాపీ లు ఇప్పించారని తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

వాజేడు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుం ది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మురుమూరు పంచాయతీలోని కొప్పుసురులో రొడ్డ మహేష్‌కు చెందిన ఇంట్లో అర్ధరాత్రి సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యింది. మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో మహేష్ దంపతులు, ఇద్దరు పిల్లలు బయటకు పరుగులు పెట్టారు. ఇంట్లోని వస్తువులన్నీ కాలిబూడిదయ్యా యి. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసి నా రేకులు తప్ప సర్వం దగ్ధమయ్యాయి. సంఘటన స్థలాన్ని రెవెన్యూ, విద్యుత్ అధికారులు పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ ప్రమాదంతో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం కలిగినట్టు బాధితుడు మహేష్ తెలిపాడు.

సీపీఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వారోత్సవాలు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను సీపీఐ ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్దనున్న అమరవీరుల స్తూపం వద్ద అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమా ర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. సాయుధ పోరాట అసలైన వారసులు కమ్యూనిస్టులేనన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మోటపలుకుల రమేష్, పైన్ల శాంతికుమార్, అన్నారపు రాజేందర్, జి.శ్రీనివాస్, నూకల చంద్రమౌళి, నేరేళ్ల జోసెఫ్, తాళ్ల పోశం తదితరులు పాల్గొన్నారు.


అమరవీరుల స్తూపం వద్ద అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రాజ్‌కుమార్

ములుగు జిల్లాలో సగటు వర్షపాతం 4.68 సెం.మీ

● వెంకటాపురం మండలంలో అత్యధికంగా 13.02 సెం.మీ

ములుగు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో జోరుగా వర్షం కురిసింది. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లా వ్యా ప్తంగా 42.20 సెం.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు వర్షపాతం 4.68 సెం.మీ రికార్డు అయ్యింది. అత్యధికంగా వెంకటాపురం మండలంలో 13.02 వర్షపాతం నమోదైంది. కన్నాయిగూడెం మండలంలో 6.38 సెం.మీ, ఏటూరునాగారం మండలంలో 6.16 సెం.మీ, వాజేడు 4.36, వెంకటాపూర్ 3.42 సెం.మీ, మంగపేట 2.42, తాడ్వాయి 2.36, గోవిందరావుపేట మండలంలో 2.36 సెం.మీ, ములుగు మండలంలో అత్యల్పంగా 1.72 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

నేమ్ బోర్డులు లేకుండానే ఈజీఎస్ బిల్లులు

టీఏ భార్య పేరు మీద రూ.2400

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా చేసిన పని ప్రదేశాల్లో నేమ్ బోర్డులు లేకుండానే ఈజీఎస్ అధికారులు బిల్లులు చెల్లింపులు చేశారు. మెటీరియల్ పేమెంట్ కింద చేసిన పనుల బిల్లులు జీపీ ఖాతాలో జమా చేయాల్సి ఉండగా టీఏ భార్య పేరుమీదనే బిల్లులు చేసినట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించారు. తొర్రూరు మండలంలో 2024-2025సంవత్సరానికి గాను చేపట్టిన 16వ విడత సామాజిక తనిఖీల్లో ఈజీఎస్ అవకతవకలు ఒకొక్కటిగా బయటపడుతున్నాయి. గత మూడు రోజుల పాటు మండలంలో విడతల వారీగా సామాజిక తనిఖీలు, గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. ఆదివారం బోజ్యాతండా, చింతలపల్లి, జీకేతండా, గోపాలగిరి, మడిపల్లి, హచ్చుతండా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి గ్రామాల్లో జరిగిన పనులు, గుర్తించిన అవకతవకలను ఆయా గ్రామ ప్రత్యేకాధికారులు, ప్రజల ముందు వెల్లడించారు. బోజ్యాతండాలో చేసిన పని ప్రదేశాల్లో నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉండగా 3బోర్డులకు రూ.12వేలు బిల్లులు చెల్లించారు. ఫైల్ పేమెంట్లు రూ.2400 టీఏ భార్య పేరుమీద బిల్లు చెల్లించారు. పని చేయనివారికి రూ.2468 బిల్లులు చెల్లించినట్లు డీఆర్పీ వెల్లడించారు. మడిపల్లిలో నేమ్‌బోర్డు ఏర్పాటు చేయకుండానే రూ.4వేలు బిల్లు చేయగా, గోపాలగిరిలో 2 నేమ్‌బోర్డుకు రూ.8 వేలు, చింతలపల్లిలో 3 బోర్డులకు రూ.12వేల చొప్పున బిల్లులు చేసినట్లు గుర్తించారు. జీకేతండాలో 22 మంది కూలీలు పనులు చేస్తే రూ.13,374 చెల్లించలేదు. అనేక చోట్ల పని చేసిన వారికి కాకుండా చేయని వారికి, సంతకాలు లేకుండా బిల్లులు చెల్లించారు. పలు గ్రామాల్లో ఈజీఎస్ సిబ్బంది బినామీల పేరుతో బిల్లులు తీసుకున్నట్లుగా వస్తున్న ఆరోపణలపై తనిఖీ బృందం లోతుగా విచారణ చేపడితే మరిన్ని అవకతవకలు బయటపడనున్నాయి. ఆయా గ్రామాల్లోని గ్రామ సభల్లో డీఆర్పీలు భవాని , క్రిష్ణమరాజు, పద్మ, మౌనిక, పంచాయతీ కార్యదర్శులు, కూలీలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


బోజ్యాతండా గ్రామ సభలో వివరాలు వెల్లడిస్తున్న డీఆర్పీ వినయ్‌వర్మ (ఫైల్)

ఇల్లందలో మరో అహోబిలం



ఇల్లందలో ఒకే ప్రాంగణంలో ఉన్న శివ-విష్ణు దేవాలయాలు

- ఒకే ప్రాంగణంలో శైవ-వైష్ణవ దేవాయాలు
- 18వ శతాబ్దంలో నిర్మించిన రాతి కట్టడాలు
- ఒకేచోట 4 శివలింగాలు, 2 నందులు
- శిథిలావస్థలో కట్టడాలు
- పట్టించుకోని ప్రభుత్వం

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రం అహోబిలంలో నవ నరసింహ క్షేత్రాల మాదిరిగా వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లందలో ఉంది. పూర్వకాలంలో వేద పండితులు ఇల్లంద ఆలయాన్ని ఆధారంగా చేసుకుని జఫర్‌గడ్, కక్కిరాలపల్లి చుట్టు పక్కల ప్రాంతాల్లో తొమ్మిది లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలను నిర్మించారు. ఇల్లందలో రాతితో ఏర్పాటు చేసిన ఈ ఆలయాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి. 425 ఏళ్లకు పైగా చెక్కు చెదరకుండా దర్శనమిస్తోంది.



ఆలయంలోని రాతి స్తంభాలు

కాకతీయుల కాలం నాటి కట్టడాలు

మరో అహోబిలాన్ని తలపించేలా శివ-విష్ణు రూపస్నుట దేవాలయం (హరిహరులు ఒకే ప్రాంగణంలో ఉండడం) 18వ శతాబ్దంలో రామలింగేశ్వరస్వామి- లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయాలను ఒకేచోట వేర్వేరుగా నిర్మించారు. కాకతీయుల కాలంలో ఈ ఆలయాలకు అంకురార్పణ జరిగినట్లు వేద పండితులు, పూర్వీకులు చెబుతున్నారు. దానికి గుర్తుగా ఆలయానికి నాలుగు వైపులా బురుజులు కనిపిస్తాయి. కుడి వైపున ఉన్న లక్ష్మీనర్సింహస్వామి, ఎడమ వైపున రామలింగేశ్వర స్వామి ఆలయాలు ఉండడం విశేషం. విష్ణుమూర్తి కుడివైపునా ఉండి, శివుడు ఎడమ వైపున కనిపించడం అరుదు.

ఇలాంటి ఆలయం ప్రభుత్వ ఆదరణకు నోచుకోవడం లేదు.

ఆలయాల ప్రాముఖ్యత

దేవాలయాల నిర్మాణంలో ఎక్కడా సిమెంటు, మట్టి, ఇటుకలు లేకుండా రాతితో నిర్మించారు. వరంగల్ కోట తరహాలో దేవాలయంలోని గర్భాలయాలు, ముఖ మండపాలు, అర్ధ మండపాలు సుందరంగా తయారు చేసిన స్తంభాలు కనిపిస్తాయి. దేవాలయాలపై కప్పులు కూడా పూర్తిగా శిలలతో అపురూపంగా తయారు చేసిన రాతి నగిషీలు కనువిందు చేస్తాయి. కాకతీయుల కాలంలో ఆలయాలను నిర్మించినట్లు ఆలయం చుట్టూ నాలుగు బురుజుల ఆనవాళ్లు ఇప్పటికీ కనిపిస్తాయి. అవి శిథిలావస్థకు చేరి పిచ్చి మొక్కలు పెరిగాయి.

జీర్ణావస్థలో శైవ-వైష్ణవ ఆలయాలు

ఈ ఆలయాలను ప్రభుత్వాలు, పాలకులు పట్టించుకోవడం లేదు. దీంతో చాలా సంవత్సరాలుగా ఆలయాలు జీర్ణావస్థకు చేరుకున్నాయి. ఉభయ దేవాలయాలపై నిర్మించిన గోపురాలు కూలిపోయే స్థితికి చేరుకున్నాయి. గర్భాలయాల పై ఇటుకతో నిర్మించిన గోపురాలపై చెట్లు మొలుస్తున్నాయి. వర్షాకాలంలో గోపురాలపై నుంచి గర్భాలయంలోకి నీరు కారుతూ పూజా కార్యక్రమాలకు ఇబ్బందిగా మారింది. భారీ వర్షాలు కురిస్తే ఎప్పుడు కూలుతాయోనని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేవాలయ ప్రాంగణం కంటే గర్భాలయాలు, ముఖ మండపం రెండు అడుగుల లోతులోకి వెళ్లిపోయాయి. దీంతో వర్షపు నీరు దేవాలయంలోకి చేరడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దేవాలయానికి చుట్టూ ఉన్న ప్రాకారం కూడా రాతితో ఏర్పాటు చేశారు. సుమారు పది అడుగుల వెడల్పు, పది పీట్ల ఎత్తుతో నిర్మించిన ప్రహరీ రాళ్లు చెదిరి పడిపోతున్నాయి. చారిత్రక కట్టడాలను కాపాడి భావితరాలకు అందించాల్సిన ప్రభుత్వాలు, పాలకులు పట్టించుకోవడం లేదు. ఈ ఆలయంపై ఇప్పటికైనా శ్రద్ధ వహించి భక్తులు కోరుతున్నారు.

చతుర్లింగేశ్వర దేవాలయం

ఈ ఆలయం చతుర్లింగేశ్వర దేవాలయంగా ప్రసిద్ధి. గర్భాలయంలో కుష్మాండ లింగం, అర్థ మండపంలో సోర లింగం, ముఖ మండపంలో బ్రహ్మసూత్ర లింగాలు కనిపిస్తాయి. అలాగే గర్భాలయానికి ఎదురుగా రెండు నందులు కూడా ఉండడం విశేషం.

ప్రతీ ఏటా ఉత్సవాలు

మాఘ మాసంలో పౌర్ణమి సందర్భంగా ఐదు రోజుల పాటు లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ ఉత్సవాలు నిర్వహిస్తారు. అదే మాసంలో ఆరుద్ర నక్షత్రంలో శివ కల్యాణం మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తారు. ఈ కల్యాణం సందర్భంగా ఇతర నగరాలు, ప్రాంతాలకు వెళ్లిన వేద పండితుల కుటుంబాలు సైతం తప్పనిసరిగా హాజరవడం సంప్రదాయంగా వస్తోంది. దీనికి తోడు హనుమాన్ జయంతి, వినాయక చవితి, దేవి నవరాత్రోత్సవాలు ఇందులోనే నిర్వహిస్తారు.



శిథిలావస్థలో ఉన్న ఆలయ గోపురం



విజేత ఆదిలాబాద్ బాలుర జట్టుకు షీల్డులను అందిస్తున్న అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు

బాల్ బ్యాడ్మింటన్ సందడి

- విజేతలుగా ఆదిలాబాద్ (బాలుర), మెదక్ (బాలికల) జట్లు
- బాల్ బ్యాడ్మింటన్ అభివృద్ధికి కృషి చేస్తామన్న నిర్వాహకులు
- జనగామ జిల్లా కూనూరులో ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు

జఫర్‌గడ్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలంలోని కూనూరు జడ్పీ హైస్కూల్ ఆవరణలో రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు తెలంగాణ రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ (టీబీబీఏ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు ఉమ్మడి జిల్లాల వారీగా సబ్ జూనియర్ బాలురు, బాలికల పోటీలు ఉత్సాహంగా సాగాయి. అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గాదెపాక అయోధ్య అధ్యక్షతన ఆదివారం జరిగిన క్రీడల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యుడు బి.జయకర్, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి వి.వి.రమణ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలకు చెందిన బాలబాలికలు ఈ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటారన్నారు. బాల్ బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి అసోసియేషన్ కృషి చేస్తోందన్నారు. ప్రతీ ఏటా పోటీలను నిర్వహిస్తూ క్రీడా నైపుణ్యాలను వెలికితీస్తోందన్నారు. రాష్ట్రస్థాయి పోటీల విజయవంతానికి సహకరించిన అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు, దాతలు, క్రీడాభిమానులు, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

విజేతలకు బహుమతులు

కూనూరులో శని, ఆదివారాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఉమ్మడి జిల్లాలకు చెందిన బాలురు, బాలికలు 10 జట్ల చొప్పున మొత్తం 20 జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో మొదటి స్థానం ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు సాధించగా నల్లగొండ (రెండు), కరీంనగర్ (మూడు), నిజామాబాద్ (నాలుగు) స్థానాలు సాధించాయి. బాలికల విభాగంలో మొదటి స్థానం మెదక్ జట్టు, ఖమ్మం (రెండు), వరంగల్ (మూడు), ఆదిలాబాద్ (నాలుగు) స్థానాలు సాధించాయి. విజేతలకు ముఖ్య అతిథులు, అసోసియేషన్ ప్రతినిధులు బహుమతులు అందజేశారు. ప్రతిభ చాటిన, క్రీడల నిర్వహణలో సహకరించిన ప్రతినిధులు, పీఈటీలను ఈ సందర్భంగా నిర్వాహకులు సన్మానించి మెమెంటోలు అందించారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర, వివిధ జిల్లాల ప్రతినిధులు నారాయణ రెడ్డి, వీరభద్రరావు, రవీంద్రకుమార్, వీరయ్య, కమల్‌కుమార్, తిరుపతి, శ్యాం, శ్రీనివాస్ రెడ్డి, బయ్యన్న, వి.రమణ, కృష్ణమూర్తి, సాంబయ్య, ఇల్లందుల కుమార్, సిహెచ్.శ్రీనివాస్, వాసుదేవరావు, కాటం లక్ష్మారెడ్డి, నీరటి ప్రభాకర్, కాటం రాజిరెడ్డి, పీడీ సాయికుమార్, అజయ్‌కుమార్, పెద్దిరెడ్డి, చందర్ పాల్గొన్నారు.



కూకటి వేళ్లతో కూలిపోయిన శివాల మర్రి

2017లోనే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి'

దీనిపై ఎండోమెంట్ శాఖ దృష్టి సారించకపోతే రానున్న రోజుల్లో భక్తులు ఇబ్బందులకు గురయ్యే అస్కారం ఉందని 'ఆంధ్రజ్యోతి' 2017లోనే హెచ్చరించింది. ప్రైవేటు స్థలం.. తామేమీ చేసేది అన్నట్లుగా శాఖ వదిలేసింది.

కూలిపోయిన పూనకాల 'శివాల మర్రి'

ఐనవోలు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వెయ్యేళ్ల విశ్వాసం.. శివసత్తులకు కొలువైన దైవం.. నిలువెళ్ల భక్తిభావాన్ని నింపే ఐనవోలు మల్లన్న స్వామి శివాల మర్రి ఆదివారం సాయంత్రం కూకటి వేళ్లతో కూలిపోయింది. ఈ శివాల మర్రి మహావృక్షానికి ఎంతో మహిమ ఉందని ఇక్కడికి వచ్చే భక్తుల నమ్మకం. యేటా బండారి తిలకంతో లక్షలాది మంది భక్తులకు పూనకాలిస్తుంది. వెళ్లి బోనం వండి నైవేద్యం సమర్పించి పట్నాలు వేసి మొక్కులు చెల్లిస్తారు.

ఉత్తరం వైపు వృక్షం

మల్లికార్జునస్వామి ఆలయం ఉత్తరం వైపు వెయ్యేళ్ల పైనుంచే శివాల మర్రి కొలువైంది. అప్పటినుంచి మర్రిచెంతనే పూనకాలు మొదలవుతున్నాయని చరిత్ర. ఏటా సంక్రాంతి నుంచి ఉగాది వరకు జరిగే జాతరకు వచ్చే భక్తులు శివాలమర్రిని దర్శించుకున్నాకే ఆలయానికి వెళ్తారు. వాహనాల సౌకర్యం లేనిరోజుల్లో భక్తులు ఎడ్లబండ్లపైనే ఐనవోలుకు వచ్చి శివాల మర్రి వద్దకు వెళ్లి ప్రదక్షిణలు చేసేవారు. ఊడలు దిగి విశాలంగా ఉన్న చెట్టు స్థలం 1954లో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడం, ఎండోమెంట్ శాఖ పట్టించుకోని కారణంగా చుట్టూ నిర్మాణాలు జరిగాయి. అప్పటి నుంచి భక్తులు కాలినడకన వెళ్లి దర్శించుకుంటున్నారు.

స్వామివారిని దర్శించుకోవాలంటే ముందుగా ఈ మహావృక్షం వద్దకు వెళ్లి పూజాతంతును పూర్తిచేశాకే ఆలయానికి పూనకాలతో వెళ్తారు. అలాంటి శివాల మర్రి కూలిపోవడం మల్లన్న భక్తులను ఆందోళన గురిచేస్తోంది.

ఇక్కడే పూనకాలు మొదలు

రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తులు డోళ్లు, ఢమరుకాలు, బండారిని తీసుకుని సమూహంగా మర్రి వద్దకు చేరుకుంటారు. పూసలు తొడిగిన అంగీలు, గజ్జెల లాగులు ధరించి చేతిలో వీరకోలు పట్టుకుంటారు. నుదుట బండారి పసుపు బొట్టు పెట్టాక.. వారిలో స్వామి వారు ఆవహిస్తారని విశ్వాసం. మూడుసార్లు మర్రి చుట్టూ తిరిగాక డోలు, ఢమురుక శబ్దాల నడుమ పూనకంతో శివమెత్తి తన్మయంతో శివనాట్యం చేస్తూ ఆలయ ప్రదక్షిణకు బయలుదేరుతారు. మూడుసార్లు తిరిగాక స్వామి వారిని దర్శించుకుంటారు. అక్కడి నుంచి విడిది చేసిన చోటికి



ఐనవోలు ఆలయ సమీపంలో శివాల మర్రి (ఫైల్)

రీ ప్లాంటేషన్ చేయాలి

ఎంతో చరిత్ర కలిగిన శివాల మర్రిని రీ ప్లాంటేషన్ ద్వారా మళ్లీ నిలబెట్టే అవకాశాలను పరిశీలించాలని భక్తులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఎండోమెంట్ శాఖ ఈ వృక్షాన్ని నిలబెట్టాలని కోరారు. ఈ విషయంపై ఈవో సుధాకర్‌ను వివరణ కోరగా.. వృక్షాన్ని మళ్లీ నిలబెట్టే అవకాశంపై పరిశీలిస్తామని, ఆ స్థలం వారు సహకరిస్తే తప్పకుండా నిలబెట్టే ప్రయత్నం చేస్తామని తెలిపారు.

ప్రాణాలర్పించినా పట్టించుకోరా ?

- రజాకార్లతో పోరాడిన తిమ్మంపేట
- తిరుగుబాటు గ్రామాన్ని గుర్తించాలని కోరుతున్న స్థానికులు
- గుర్తులుగా మిగిలిన బురుజు, చావడీ

దుగ్గొండి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా గ్రామస్థుల తిరుగుబాటు కోసం ఏర్పాటు చేసుకున్న బురుజు, రజాకారుల నివాసం కోసం ఏర్పాటు చేసుకున్న చావడీలు వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని తిమ్మంపేటలో చిహ్నాలుగా మిగిలాయి. రజాకారుల సైన్యం స్థానిక పోలీసు పటేల్, వారి అడుగుజాడల్లో ఉన్న భూస్వాములతో కలిసి గ్రామంలోకి చొరబడి గ్రామస్థులను చిత్రహింసలు పెట్టేవారు. అధిక పన్నులు వసూలు చేయడం, పన్ను చెల్లించనివారిని దండించడం, రోజురోజుకు వారి ఆగడాలు పెరగడంతో గ్రామస్థులు వారిపై తిరుగుబాటు చేశారు. సైన్యం చేతిలో కొంత మంది చనిపోయారు. ప్రధానంగా ఆత్మకూరు దేశాయి దొర ఆధ్వర్యంలో భూస్వాములు ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. రక్షణ కోసం గ్రామస్థులు బురుజు నిర్మించి కాపలా కాసేవారు.

ప్రాణాలు కోల్పోయిన గ్రామస్థులు

1945లో రజాకారులను గ్రామానికి చెందిన కొంత మంది ప్రతిఘటించారు. వారిలో గొల్ల (తోటకూరి) బక్కయ్య, గొల్ల కనకయ్య, కత్తి సాంబయ్య, బాషబోయిన నర్సయ్యను రజాకారులు పట్టుకొని పాకాల అడవుల్లో కాల్చి చంపారు. వారి ప్రధాన అనుచరులుగా పని చేసిన భూపతి రాజలింగం, జనార్దన్, గడ్డం లక్ష్మీనర్సయ్య, కోమటి భద్రయ్యను చిత్రహింసలకు గురి చేశారు. గ్రామంలోని నాగెల్లి ముత్తయ్య, బండి మల్లయ్య, ఒద్దుల బుచ్చిరామయ్య, కుమ్మరికుంట్ల బొందయ్య, కూచన నర్సింహరాములు, గిన్నె మల్లయ్య రజాకారులు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడారు. గ్రామంలో కుమ్మరికుంట్ల బొందయ్య నాయకత్వంలో అమరవీరుల స్థూపం ఏర్పాటు చేయడంతో పాటు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. బొందయ్య సీతారామయ్య అనే పేరుతో తుపాకి పట్టి రజాకారులు, భూస్వాములు, దొరలకు వ్యతిరేకంగా గుర్రంపై తిరుగుతూ వారిని ఎదిరించారు. భూస్వామ్యుల భూములను బొందయ్య పేదలకు పంచాడు. కానీ ప్రభుత్వ పరంగా ఎలాంటి సహాయం అందకుండానే మృతి చెందాడు. వారి కుటుంబం సైతం ఎలాంటి లబ్ధి పొందలేదు.



తిమ్మంపేటలో ఉన్న బురుజు

గ్రామ రక్షణగా బురుజు

అప్పట్లో నిఘా కోసం 80 అడుగుల బురుజును గ్రామం మధ్యలో ఏర్పాటు చేసుకున్నారు. బురుజుపై గ్రామంలో వంతుల ప్రకారం కాపలాగా ఉండేవారు. ఆ బురుజు ఇప్పుడు శిథిలావస్థలో ఉంది. ప్రస్తుతం 33 అడుగుల వరకు ఉండి చిహ్నంగా మిగిలిపోయింది. ప్రతి ఏడాది ఇక్కడ వద్ద దసరా ఉత్సవాలు నిర్వహిస్తారు.

గ్రామంలో చావడీ

నిజాం రజాకారుల సైన్యం, పోలీస్ పటేల్, దొరలు, భూస్వాముల నివాసం కోసం గ్రామంలో చావడీని నిర్మించారు. ఇక్కడి నుంచే వారి కార్యకలాపాలు కొనసాగించేవారు. చావడీ నేటి వరకు గుర్తింపు చిహ్నంగా ఉండిపోయింది. ప్రస్తుతం చావడీలో ప్రతి ఏడాది ముస్లింలు పీరీలను ఏర్పాటు చేసి మొహర్రం ఉత్సవాలు జరుపుకుంటారు.



పోలీస్ పటేల్, దొరల నివాసం కోసం ఏర్పాటు చేసిన చావడీ

గ్రామానికి గుర్తింపు కల్పించాలి..

నాగెల్లి కొంరయ్య, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు



తిరుగుబాటు చేసిన గ్రామస్థులను రజాకారుల సైన్యం పాకాల అడవుల్లో కాల్చి చంపారు. గ్రామ రక్షణగా బురుజు నిర్మాణం చేసుకొని సైన్యం రాకను పసిగట్టి తిరుగుబాటు చేశారు. గ్రామంలో నెలకొల్పిన అమరవీరుల స్థూపం సైతం రోడ్డు వెడల్పులో లేకుండా పోయింది. ప్రతీ ఏడాది 17న విమోచన దినంగా అమరవీరులకు నివాళులర్పించాలి. ప్రభుత్వం గుర్తింపు కల్పించాలి.

అమరవీరుల స్థూపం నిర్మించాలి

తోటకూరి రాజు, తిమ్మంపేట



తెలంగాణ సాయుధ పోరాట యోధుల స్థూపం గ్రామంలో నిర్మించాలి. బురుజు, చావడీలు మరమ్మతులు చేయాలి. దాని చుట్టూ కంచె నిర్మాణం చేసి నేటి తరానికి అందించాలి.

కేయూలో విద్యార్థుల ఆందోళన

ఎంబీఏ విద్యార్థిపై దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులు నిరసన ఆందోళన, ఉద్రిక్తతకు దారితీసింది. శనివారం రాత్రి వర్సిటీ గెస్ట్ హౌస్ సమీపం లో దివ్యాంగుడైన ఎంబీఏ విద్యార్థిని ఓ విద్యార్థి సం ఘానికి చెందిన నాన్‌బోర్డరైన ఇద్దరు విద్యార్థి నాయకులు అడ్డుకుని దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారని విద్యార్థులు ఆందోళనకు దిగారు. దీంతో వర్సిటీ క్యాంపస్‌లో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. శనివారం జరిగిన గొడవను దృష్టిలో ఉంచుకుని ఆదివారం మధ్యాహ్నం వర్సిటీ కామన్ మెస్ వద్ద మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో మళ్లీ విద్యార్థుల మధ్య మాటా మాట పెరిగి గొడవకు దిగారు. ఎంబీఏ విద్యార్థిని దుర్భాషలాడుతూ దాడికి పాల్పడమే కాకుండా ఆదివారం మళ్లీ బెదిరింపులకు దిగడంతో ఎంబీఏ విద్యార్థులు కేయూ క్యాంపస్‌లోని మొదటి గేటు వద్ద బైఠాయించారు. దాడులకు పాల్పడిన సదరు విద్యార్థి సంఘం నేతలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



కేయూలో నిరసన చేస్తున్న విద్యార్థులు

విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో హనుమకొండ, సుబేదారి సీఐల నేతృత్వంలో ముగ్గురు ఎస్సైలు, పోలీసులు క్యాంపస్‌కు చేరుకున్నారు. అలాగే వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌లు ఆందోళనలకు దిగిన విద్యార్థులను సముదాయించేందుకు ప్రయత్నించారు. ఆదివారం అర్ధరాత్రి వరకు ఎంబీఏ విద్యార్థుల ఆందోళన వర్సిటీ క్యాంపస్‌లో కొనసాగింది. న్యాయం చేయాలని విద్యార్థుల నినాదాలతో క్యాంపస్ హోరెత్తింది. దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని విద్యార్థులు నిరసన సాగించారు.

చేప పిల్లల పంపిణీ జరిగేనా ?

- సరఫరాకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- గత బిల్లులు చెల్లించకపోవడమే కారణం



బాలసముద్రం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం అమలు చేస్తున్న ఉచిత చేపపిల్లల సరఫరా పథకం నిర్వహణలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. చేప పిల్లలను సరఫరా చేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. గత ఆగస్టు చివరి వారంలో ప్రభుత్వం టెండర్ల దాఖలుకు చివరి రోజైన సెప్టెంబరు 1 నాటికి రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 24 జిల్లాలు మాత్రమే టెం డర్లు పడ్డాయి. ఇందులో 16 జిల్లాలకు మాత్రమే రెండు కంటే ఎక్కువ టెండర్లు దాఖలయ్యాయి. 8 జిల్లాలకు అసలే టెండర్లు పడలేదు. దీనితో ప్రభుత్వం టెండర్లు వేసేందుకు ఈనెల 8 వరకు గడువును పొడిగించింది. అయినా కాంట్రాక్టర్ల నుంచి సరైన స్పందనరాకపోవడంతో ఈ నెల 12 వరకు గడువును పొడిగించారు. టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడానికి కారణం గత రెండు సంవత్సరాలుగా చేప పిల్లలను సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడమే కారణంగా తెలుస్తోంది. 2023-24 సంవత్సరంలో చేప పిల్లలను సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 74 కోట్లు చెల్లించకుండా బకాయి పెట్టింది. అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత సంవత్సరం జూలై 12న టెండర్లను ఆహ్వానించింది.

బకాయి పడిన బిల్లులు చెల్లించకుండా టెండర్లు ఎలా వేస్తామని మత్స్య శాఖ డైరెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రీ బిడ్ సమావేశంలో కాంట్రాక్టర్లు ప్రశ్నించారు. పాత బిల్లులు త్వరలో ఇప్పిస్తామని టెండర్లలో పాల్గొనాల్సిందిగా అధికారులు కోరారు. రెండు పర్యాయాలు టెండర్లు పిలిచినా ఎవరు టెండర్‌లో పాల్గొనలేదు. టెండర్లు నిర్వహించకుంటే పేద మత్స్యకారుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకం రద్దవుతుందని అధికారులు కాంట్రాక్టర్లకు నచ్చజెప్పి ఆగస్టులో మూడోసారి టెండర్లు పిలిచారు. రాష్ట్రానికి చెందిన 30 మంది కాంట్రాక్టర్లు టెండర్‌లో పాల్గొన్నారు. ప్రభుత్వం చేప పిల్లల కొనుగోలుకు రూ. 19. 26 కోట్లు మాత్రమే నిధులు కేటాయించిందని వాటితో రూ.80 కోట్ల చేప పిల్లలను సరఫరా చేసేందుకు ఎలా సాధ్యమవుతుందని కాంట్రాక్టర్లు ప్రశ్నించారు.

అధికారులు అందులో సగం 40 లక్షల చేప పిల్లల సరఫరాకు మాత్రమే టెండర్లు పిలవాలని జిల్లాల మత్స్యశాఖ అధికారులకు సర్క్యులర్ జారీ చేశారు. అంత వరకు మాత్రమే చేప పిల్లల సరఫరా జరిగింది. మళ్లీ 2025-26 సంవత్సరానికి రొయ్యలతో పాటు ఈ పథకం అమలుకు ప్రభుత్వం రూ. 122 కోట్ల 23 లక్షలు కేటాయించిందని, కానీ ఇంత వరకు బడ్జెట్ రిలీజ్ కాలేదని కాంట్రాక్టర్లు టెండర్ వేసేందుకు ఎవరు ముందుకు రావడం లేదు. ఎలాగైనా టెండర్లు నిర్వహించి పథకాన్ని కొనసాగించాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆంధ్ర ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్లు టెండర్లు వేయాలని కోరుతున్నట్లు తెలుస్తోంది.

వెయిట్ లిఫ్టింగ్‌లో గోల్డ్‌మెడల్

- ఖమ్మంలో జరిగిన 60 కేజీల విభాగంలో పతకం
- జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి హరిత
- ఆనందంలో స్వగ్రామం జనగామ జిల్లా ఇప్పగూడెం

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలం లోని ఇప్పగూడెంకు చెందిన వారాల హరిత ఆదివారం రాత్రి ఖమ్మంలో జరిగిన రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ 60కేజీల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన వారాల రాజు-రమ్య దంపతుల చిన్న కుమార్తె హరిత, నాల్గవ తరగతిలో హైదరాబాద్ హకీం పేట స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపి కైంది. ప్రస్తుతం స్కూల్‌లో పదోతరగతి చదువుతోంది. వెయిట్ లిఫ్టింగ్‌లో తర్ఫీదు పొందిన హరిత జాతీయ స్థాయిలో రాణించడం విశేషం. జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక కావడానికి క్రీడా కారులు రెండు స్టేట్‌మీట్‌లలో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధిం చాల్సి ఉంటుంది. అందులో భాగంగా హరిత సెప్టెంబర్ 7న హైదరాబాద్ లాలాపేట్ ఇండోర్ స్టేడియంలో జరిగిన స్టేట్ మీట్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. ఈరోజు (14 సెప్టెంబర్)న ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగిన స్టేట్ మీట్‌లో హరిత గోల్డ్‌మెడల్ సాధించింది. ఈనెల 22న కర్ణాటక రాజధాని బెంగుళూరులో జరిగే జాతీయస్థాయి పోటీలో పాల్గొననుంది. హరిత ఎంపికపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గోల్డ్ మెడల్‌తో వారాల హరిత

ఏజెన్సీలో 'యూరియా' రాజకీయం

- రైతులకు ఏం జరిగినా దాని కోసమే నంటూ హంగామా
- ఆ తర్వాత మాట మార్చుతున్న బాధితులు
- సోషల్ మీడియాలో అధికార, ప్రతి పక్ష నాయకుల వార్



మల్లెల నర్సయ్యను పరామర్శిస్తున్న మంత్రి సీతక్క (ఫైల్)



నర్సయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి (ఫైల్)

కొత్తగూడ, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ప్రస్తుతం యూరియా రాజకీయం జరుగుతోంది. యూరియా కొరతను ఆసరాగా తీసుకుని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తుంటే.. రైతులకు సకాలంలో యూరియా అందిస్తున్నామని అధికారపార్టీ నాయకులు చెబుతున్నారు. అయితే యూరియా కేంద్రాల వద్ద రైతులు సొమ్మసిల్లి పడిపోయినా.. ఆత్మహత్యాయత్నం చేసినా యూరియా కోసమేనని కథనాలు వినిపిస్తున్నాయి. ఆ తర్వాత బాధిత రైతులు మాట మార్చుతూ రాజకీయ నాయకులతో ఆటలు ఆడుకుంటున్నారు. ఈ మేరకు కొత్తగూడ మండలంలో కొద్ది రోజులుగా ఇలాంటి పలు సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

పొగుళ్లపల్లి సొసైటీలో ఏర్పాటు చేసిన యూరియా పంపిణీ కేంద్రానికి మండలంలోని ఈశ్వరగూడెం గ్రామానికి చెందిన కుంజ లక్ష్మీనర్సు ఈనెల 4న (గురువారం) సొసైటీ వద్దకు వచ్చాడు. వరుసలో నిలబడగా స్పృహతప్పి పడిపోయాడు. అక్కడే ఉన్న ఎస్సై రాజ్‌కుమార్ తన వాహనంలో కొత్తగూడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చాడు. వైద్యుడు లక్ష్మీనర్సుకు చికిత్స అందించారు. ఆరోగ్య పరిస్థితుల గూర్చి లక్ష్మీనర్సును ఎస్సై రాజ్‌కుమార్ ప్రశ్నించగా.. మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నానని, యూరియా అవసరం కావడంతో సొసైటీ వద్దకు వచ్చామని లక్ష్మీనర్సు, కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కుంజ లక్ష్మీనర్సు సొమ్మసిల్లి పడిపోవడంపై సోషల్ మీడియాలో చర్చ కొనసాగింది.

అలాగే 13న (శనివారం) కొత్తగూడ గ్రామం బూరుగుగుంపునకు చెందిన మల్లెల సారయ్య పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలో యూరియా బస్తాలు దొరకకపోవడంతో పంట ఎండిపోతుందని బాధతో పురుగుల మందు తాగినట్టు నర్సయ్య పేర్కొన్నారు. నర్సంపేట ఆస్పత్రిలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి నర్సయ్యను పరామర్శించారు. యూరియా అందించటంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపణలు చేశారు. శనివారం రాత్రి మంత్రి సీతక్క సైతం నర్సయ్యను పరామర్శించి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. అయితే తనకు యూరియా దొరికిందని, మద్యం మత్తులో పురుగుల మందు తాగానని మల్లెల నర్సయ్య మాట్లాడుతున్న వీడియోతోపాటు కుటుంబ కలహాలతోనే మానాన్న పురుగుల మందు తాగాడని, కొందరు కావాలని యూరియా దొరకకనే పురుగుల మందు తాగినట్టు ప్రచారం చేస్తూ రాజకీయం చేస్తున్నారని నర్సయ్య కూతురు రజిత మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఏది వాస్తవమో ఏది అవాస్తవమో తెలియని స్థితి నెలకొంది. దీంతో రాజకీయ నాయకులు రైతులతో ఆటలాడుకుంటున్నారా..? రైతులు రాజకీయ నాయకులు ఆటలాడుకుంటున్నారా..? తెలియని పరిస్థితి నెలకొంటోంది.

రైతులకు సరిపడా బస్తాలు ఇవ్వాలి

- సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు తోట శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ కమిటీ సభ్యుడు తోట శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రైతులందరికీ సరిపడా యూరియా బస్తాలను అందించాలని సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు తోట శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ ఆవరణలో సీపీఎం శిఖార్‌ఖానగడ్డ శాఖ సమావేశాన్ని ఆదివారం తోట రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తోట శ్రీనివాస్ మాట్లాడుతూ గత రెండునెలల నుంచి యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సకాలంలో యూరియాను అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. పాలకుల నిర్లక్ష్యంతో రైతులకు యూరియా అందలేదని మండి పడ్డారు. జిల్లా కేంద్రంలోని వీఆర్ఎన్ గార్డెన్స్‌లో ఈ నెల 17న జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో తోట యాకయ్య, చిగురుపాటి రమేష్, ఉపేందర్, తోట సుధాకర్, బానోత్ రవి, కుంట అంజయ్య పాల్గొన్నారు.

ఆందోళన వద్దు.. అందరికీ యూరియా ఇస్తాం

(5వ పేజీ తరువాయి)

రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని డీఎస్పీ కృష్ణ కిషోర్ అన్నారు. తొర్రూరులోని రైతు వేదికను తనిఖీచేసి అధికారులకు తగు సూచనలు చేశారు. యూరియా సరఫరాలో ఎలాంటి అవకతవకలకు పాల్పడవద్దని వ్యవసాయాధి కారులకు సూచించారు. యూరియా సరఫరా నిరంతరం కొనసాగుతుందని, గ్రామాల వారీగా అధికారులు టోకెన్‌లు ఇస్తున్నారని, సొసైటీ వద్ద యూరియా సరఫరా చేస్తారని అక్కడే తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉపేందర్, వ్యవసాయాధికారులు తదితరులు ఉన్నారు.



కోబల్‌తండాలో రాస్తారోకో చేస్తున్న రైతులు

కోబల్‌తండాలో రాస్తారోకో

● గూడూరు : యూరియా కోసం గూడూరు మండలంలో బారులు తీరారు. గూడూరు మండలంలోని గాజులగట్టు రైతులకు అదే గ్రామంలోని పాఠశాలలో యూరియా పంపిణీ కోసం కూపన్లను అందించారు. చిన్న ఎల్లాపురం రైతులకు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కూపన్లు అందించారు. గోవిందాపురం, దుబ్బగూడెం రైతులకు బొద్దుగొండ రైతు వేదిక వద్ద అధికారులు కూపన్లను అందించారు. మండలానికి 660 బస్తాల యూరియా బస్తాలు రాగా, సుమారు వెయ్యికి పైగా రైతులు తరలివచ్చి క్యూలైన్‌లో నిలబడ్డారు. యూరియా బస్తాలు అందని కోబల్‌తండా రైతులు మహబూబాబాద్-నర్సంపేట జాతీయ రహదారిపై అర్థగంటపాటు రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న గూడూరు సీఐ సూర్యప్రకాష్, ఏవో అబ్దుల్ మాలిక్‌లు రైతుల వద్దకు చేరుకుని యూరియా బస్తాలు అందించేలాచర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

ఉసురు తీసిన 'యూరియా'

(5వ పేజీ తరువాయి)

ఉంది. అందులో వరి, మిర్చి, మొక్కజొన్న పంటలను సాగు చేశాడు. జోషి తండాకు చెందిన ధరావత్ వీరన్న (46)కు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా అందులో వరి, మిర్చి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నాడు. పంటకు యూరియా తీసుకువచ్చేందుకు ఇద్దరు కలిసి ద్విచక్రవానంపై కూపన్‌లను తీసుకునేందుకు బొద్దుగొండ రైతువేదిక వద్దకు వస్తున్నారు. ఈ క్రమంలో జగన్నాయకులగూడెం క్రాస్‌రోడ్డు వద్ద మహబూబాబాద్ నుంచి నర్సంపేట వైపు వెళుతున్న బొలేరో వాహనం.. ద్విచక్రవాహనంపై వస్తున్న రైతులను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి లాల్యా అక్కడికక్కడే మృతి చెందగా వీరన్నను మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం అక్కడ వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు తరలిస్తుండగా మృతి చెందాడు.

విషయం తెలుసుకున్న సీఐ సూర్య ప్రకాష్ ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతుడు లాల్యాకు భార్య లక్ష్మి, కుమారుడు రమేష్, కుమార్తెలు సునీత, వినోద ఉన్నారు. ధారావత్ వీరన్న కు భార్య లక్ష్మి, కుమారుడు గణేష్, కుమార్తెలు అఖిల, సునీతలు ఉన్నారు. మృతి చెందిన రైతుల కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా, మృతిచెందిన రైతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మార్చురీ గది ఎదుట బాధితకుటుంబ సభ్యులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. వారికి మద్దతుగా మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు సత్యవతిరాథోడ్ రైతుల మృతి విషయాన్ని ఫోన్ ద్వారా వివరించారు. రైతులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న మానుకోట కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నిజామాబాద్ జిల్లాలో ఈనెల 25 నుంచి 28 వరకు జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీలకు రెండుజట్లు ఎంపికైనట్లు మహబూబాబాద్ కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నంద వీరన్న పేర్కొన్నారు. మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 350 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరికి ఈ నెల 16 నుంచి 23 వరకు కురవి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు బానోత్ చాంప్లానాయక్, గందసిరి శ్రీనివాస్, తోట ఏకాంబరం, రాసమల్ల అనిల్, ఇమామ్, అఖిల్, అన్వేష్, రామ్, చరణ్‌తేజ, శ్రీను, వ్యాయామ ఉపాధ్యాయులు మాధవి, లక్ష్మీ, రాజకుమారి, అనిల్, రఘు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వాన

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. గూడూరులో భారీ వర్షం కురియగా, బయ్యారం, డోర్నకల్, కేసముద్రం, దంతాలపల్లి, తొర్రూరు మండలాల్లో ఓ మాదిరి వర్షం కురిసింది. మిగతా మండలాల్లో వర్షం కురిసింది. జిల్లాలో 203.2 మిల్లీమీటర్ల వర్షం కురియగా సగటున 12.7 మిల్లీమీటర్ల వర్షం పడింది. గూడూరులో 66.0, కొత్తగూడలో 6.2, గంగారంలో 6.8, బయ్యారంలో 14.6, గార్లలో 9.6, డోర్నకల్‌లో 14.2, కురవిలో 6.8, మహబూబాబాద్‌లో 8.6, కేసముద్రంలో 13.2, నెలికుదురులో 7.4, నర్సింహులపేటలో 5.0, చిన్నగూడూరులో 4.6, మరిపెడలో 5.2, దంతాలపల్లిలో 16.2, తొర్రూరులో 12.6, పెద్దవంగరలో 6.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి సాయం

ఇనుగుర్తి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన నాగెల్లి యాకలక్ష్మికి కేసముద్రం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.6500నగదు, 50 కిలోల బియ్యాన్ని ఆదివారం రాత్రి అందజేశారు. యాకలక్ష్మి భర్త, అత్త గతంలోనే మరణించగా ఇటీవలె మామ వెంకటయ్య మృతి చెందారు. ఆమె కూలీ పనికి వెళుతు ఇద్దరు పిల్లలను పోషిస్తోందని, ఈ నేపథ్యంలోనే ఆమెకు సహాయం అందించినట్లు క్లబ్ ప్రతినిధులు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.చంద్రశేఖర్, పాస్ట్ జడ్‌సీ యర్నం శ్రీరాములు, పాస్ట్ ప్రెసిడెంట్ బోగోజు నాగేశ్వరాచారి, పరాంకుశం శ్రీహరి, చింతా కరుణాకర్, రుద్ర శ్రీకాంత్, మదిపెద్ది వెంకటేష్ పాల్గొన్నారు.

పద్మ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం

గూడూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గూడూరు శ్రీలక్ష్మీనారాయణ పొదుపు సంఘం సభ్యురాలు శీలం పద్మ ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందారు. మృతురాలు శీలం పద్మ కుటుంబానికి పొదుపు సంఘం సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. సంఘం బాధ్యులు చెన్నబోయిన ఉప్పలయ్య, కన్నబోయిన వెంకన్న, ముక్తవరపు సత్యనారాయణ, దోని యాదగిరి, ఊట్ల సంపత్, అంబటి చంద్రమౌళి పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్త బోధనలను అనుసరించాలి



షర్బత్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త బోధనలను అనుసరించి యువత సన్మార్గంలో నడవాలని ముస్లిం మత పెద్దలు సయ్యద్ అహ్మద్ రిజ్వీ, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎమ్డీ. ఫరీద్, ఎమ్డీ. ఎక్బాల్, అసద్ అలీఖాన్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో మహ్మద్ ప్రవక్త జన్మదిన మాసాన్ని పురస్కరించుకుని అహ్లే సున్నత్ జమాత్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పురవీధుల్లో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి ముస్లింలు పెద్దఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త సూచించిన సన్మార్గంలో యువత ముందుకు సాగాలని సూచించారు. ప్రతీ ఒక్కరుఇతరులకు తమకు తోచిన సాయాన్ని అందించి బాసటగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిఫ్ అలీ, ఎమ్డీ.హరుణ్, వాహేద్, జాకీర్, సాజిద్, యాకూబ్, రజాక్, జమీల్, మహబూబ్‌పాషా, రియాజ్ అన్సారీ పాల్గొన్నారు.

● మహ్మద్ ప్రవక్త 1500 జయంతిని పురస్కరించుకుని కంకరబోడ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొహబ్బర్ క షర్బత్‌ను పంపిణీ చేశారు. జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ ప్రారంభించారు. గత 10 రోజులుగా సేవా కార్యక్రమాల్లో భాగంగా రోగులకు పండ్లు పంపిణీ, అన్నదానం చేశారు. ముబాషిర్‌అనీస్, అమీర్‌సోహెల్, ముబీన్, రిజ్వాన్, సమీర్, ఇమాముద్దీన్, ఇర్ఫాన్, సయ్యద్ అమీర్, సోహెల్, రియాజ్, సమీ అర్బాజ్ పాల్గొన్నారు.

గాంధీపురంలో బీజేపీలో 40 మంది చేరిక



గాంధీపురంలో బీజేపీలో చేరిన వారికి కండువా కప్పుతున్న పట్టణ అధ్యక్షుడు అజయ్

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని గాంధీపురం గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 40 మంది భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరినట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వెన్నమల్ల అజయ్ ఆదివారం తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నరసింహ, భద్రయ్య, లింగయ్యతో పాటు మరో 37మంది బీజేపీలో చేరారు. చేరిన వారికి పార్టీ అధ్యక్షుడు అజయ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించాడు. అనంతరం గాంధీపురం బూత్‌కమిటీ అధ్యక్షుడిగా ధరంసోత్ కవిత, ఉపాధ్యక్షుడిగా బాబర్, కార్యదర్శిగా బోడ భద్రును ఎన్నుకున్నట్లు తెలిపారు. కోటి, రవికుమార్, నరేష్ పాల్గొన్నారు.

కార్యక్రమాలను విజయవంతం చేయాలి

● కేసముద్రం : సేవాపక్షం కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు తుంపిళ్ల శ్రీనివాస్ కోరారు. సేవాపక్షం మండల కన్వీనర్ బోగోజు నాగేశ్వరాచారి ఆధ్వర్యంలో కేసముద్రం లక్ష్మిసాయి గార్డెన్స్‌లో ఆదివారం పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈనెల 17 నుంచి 15 రోజులపాటు పార్టీ ఆధ్వర్యంలో యువత మత్తుకు బానిస కాకుండా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకుడు వోలం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఉప్పునూతుల రమేష్, బోనగిరి ఉపెందర్, బేతి వెంకన్న, జాటోత్ నరేష్, రమేష్, మూడావత్ అశోక్, జాటోత్ సుమన్, మంగ వెంకన్న పాల్గొన్నారు.

'నర్సయ్య ఆత్మహత్యాయత్నంకు.. యూరియా కారణం కాదు'

కొత్తగూడ, సెప్టెంబర్14 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడ్కు చెందిన మల్లెల నర్సయ్య ఆత్మహత్యాయత్నంకు కారణం యూరియా కాదని, వారి ఇంట్లో జరిగిన కుటుంబ కలహాలే కారణమని డీఏవో విజయనిర్మల ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. నర్సయ్య తన 8.34 ఎకరాల అటవీహక్కు భూమిలో వరి పొలం సాగుచేస్తున్నాడని పేర్కొన్నారు. పంటకు మొదటి దఫాలో యూరియా వేసినట్టు నర్సయ్య ఒప్పుకున్నాడని, ఈనెల 7న పొగుళ్లపల్లి సొసైటీ వద్దకు వచ్చి మరో యూరియా బస్తా తీసుకున్నాడని పేర్కొన్నారు. 13న (శనివారం) మండలంలో ఎక్కడ యూరియా పంపిణీ జరగలేదని పేర్కొన్నారు. నర్సయ్య కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఇంట్లో జరిగిన కుటుంబ కలహాలతోనే నర్సయ్య పొలం వద్ద పురుగులమందుతాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్టు పేర్కొన్నారు. పత్రికల్లో ప్రచురితమైన వార్త అవాస్తవమని పేర్కొన్నారు.

గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్లను సర్కార్ అందించాలి



గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ఉడత రవీందర్

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి) : గొర్రెలు, మేకలకు నట్టలమందుతో పాటు అన్నిరకాల వ్యాక్సిన్లు, మందులు ప్రభుత్వం పంపిణీ చేయాలని గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం (జీఎంపీఎస్) రాష్ట్ర కార్యదర్శి ఉడత రవీందర్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ భగత్ సింగ్‌నగర్‌లోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం పయ్యావుల మల్లయ్య అధ్యక్షతన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ గతంలో పశువుల ఆస్పత్రిలో అన్ని రకాల మందులు, వ్యాక్సిన్లు అందజేసేవారని, ప్రస్తుతం గొర్రెలు, మేకలకు ఎలాంటి మందులు అందించడం లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి అన్ని రకాల మందులు అందించి గొర్ల కాపరులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్, చల్లగొల్ల మల్లయ్య, ఇమ్మడి గోవిందు, గంద్రకోటి కుమార్, కొమ్మనబోయిన యాకయ్య, వాసం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే (హెచ్143) మండల కార్యవర్గం ఎన్నిక

గూడూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీయూడబ్ల్యూజే హెచ్-143) మండల కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా షేక్.యాకూబ్, ప్రధాన కార్యదర్శిగా బానోత్ రామన్ననాయక్, కోశాధికారిగా గడ్డల శ్రీనివాస్, కార్యదర్శిగా మంగ మహేందర్, ఉపాధ్యక్షుడిగా జిమ్మిడి సంతోష్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా కమటం సంతోష్‌ను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు ఆ సంఘం జిల్లా కన్వీనర్ మద్దినేని గుట్టయ్య, కో కన్వీనర్ శేఖర్ హాజరయ్యారు.

ఈదులపూసపల్లిలో ముస్లింల ర్యాలీ

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామం నుంచి జిల్లా కేంద్రం వరకు ముస్లీం, మైనార్టీ లు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా ముతావలి షేక్ అన్వర్ తాజీ మాట్లాడుతూ...మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

అనంతరం భక్తులకు పాయసం, స్వీట్లు పంపిణీ చేశారు.



ఈదులపూసపల్లి దర్గా వద్ద మాట్లాడుతున్న దర్గాముతావలి షేక్ అన్వర్ తాజీ

సీనియర్ వైద్యుడు పండరీనాథ్ మృతి

- నివాళులర్పించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మాజీ మంత్రి, మాజీ ఎంపీ

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పట్టణానికి చెందిన సీనియర్ (తొలి తరం) వైద్యుడు క్షీరసాగర్ పండరీనాథ్ (87) అనారోగ్యంతో ఆదివారం తుది శ్వాస విడిచాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ ఇంటి వద్ద మృతి చెందాడు.

సీనియర్ వైద్యుడు పండరీనాథ్ గత 50 సంవత్సరాలుగా మహబూబాబాద్ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించి ప్రాణదాతగా నిలిచారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. డాక్టర్ పండరీనాథ్ మృతి విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ మాలోతు కవిత, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, మాజీ సర్పంచ్ సుధాఅర్జున్‌రెడ్డి వివిధపార్టీలు, స్వచ్ఛందసంస్థల బాధ్యులు, వైద్యులు దేవరం ప్రకాశ్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, ఎడ్ల రమేష్, శంతన్‌రామరాజు, ఎడ్ల వేణు, ముత్యం వెంకన్న, డాక్టర్ బానోత్ నెహ్రూరాథోడ్, వీవీ. ప్రసాద్, డాక్టర్ బి. వీరన్న తదితరులు మానుకోటలో పండరీనాథ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.